ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
3 జిల్లా వార్తలు
బుధవారం 5 నవంబరు 2025

రేపటి నుంచి 11వ జోనల్ క్రీడా పోటీలు

షాద్‌నగర్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల కళాశాలలో ఈ నెల 6 నుంచి 10 వరకు 11వ జోనల్ లెవల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విద్యులత తెలిపారు. క్రీడల్లో రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతారని తెలిపారు. క్రీడాకారులకు కమ్మదనం కళాశాలలో వసతి సౌకర్యం ఉంటుందని, ప్రతి ఒక్కరూ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

కదిలిస్తే కన్నీరే..

విషాదంలో బాధిత కుటుంబాలు

రోదనలతో తల్లడిల్లిన వికారాబాద్ జిల్లా

అశ్రునయనాల మధ్య ముగిసిన అంత్యక్రియలు

తీరని శోకాన్ని మిగిల్చిన మీర్జాగూడ రోడ్డు ప్రమాదం



లక్ష్మీనారాయణపూర్‌లో రోదిస్తున్న మృతురాలు అఖిలారెడ్డి తల్లి అలివేలు





చేవెళ్ల మండలం, మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. పలు కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది. ఉన్నంతలో ఆనందోత్సాహాలతో సాగుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. ప్రాణాలు కోల్పోయిన వారి అంత్యక్రియలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితుల అశ్రునయనాల మధ్య జరిగాయి. తొమ్మిది మంది అంత్యక్రియలు, రోదనలతో తాండూరు నియోజకవర్గం తల్లడిల్లింది. ఎవరినీ కదిలించినా అయ్యో పాపం.. అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

నేడు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికసాయం

తాండూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మీర్జాగూడ వద్ద బస్సు ప్రమాదంలో మరణించిన తాండూరు నియోజకవర్గానికి చెందిన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికీ రూ.7లక్షల ఆర్థిక సహాయం చెక్కులను బుధవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్ అందజేయనున్నారు. ఇందిరమ్మ కాలనీ, గౌతాపూర్ రోడ్డు, వాల్మీకినగర్, బృందావన్ కాలనీ, పాత తాండూరు, హాజీపూర్, లక్ష్మీనారాయణపూర్, పేర్కంపల్లి గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

మరిన్ని వివరాలు 5లో..



ఆస్పత్రిలో బస్ కండక్టర్ రాధను పరామర్శిస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మీర్జాగూడ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల నేపథ్యం వింటుంటే ఎంతటి పాషాణ హృదయమైనా ద్రవించకమానదు. ఈ ప్రమాదం తల్లిదండ్రులకు పిల్లలను, పిల్లలకు తల్లిదండ్రులను దూరం చేసింది. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న పలువురు విద్యార్థుల జీవితాలను చిదిమేసింది. కుటుంబాలకు తామే దిక్కుగా ఉన్న వారి ప్రాణాలను హరించి చిన్నారులను దిక్కులేని వారిని చేసింది. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ.. ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో 19 మంది మృత్యువాత పడగా, వారిలో 15 మంది వికారాబాద్ జిల్లాకు చెందిన వారే. తాండూరు పట్టణానికి చెందిన తొమ్మిది మంది మృతి చెందిన విషయం తెలిసిందే. అలాగే యాలాల్ మండలానికి చెందిన ముగ్గురు, దౌల్తాబాద్,

మిగతా 5వ పేజీలో...

వికారాబాద్ ఆసుపత్రుల్లో ఇద్దరే..!

- హైదరాబాద్‌కు నలుగురు తరలింపు
- డిశ్చార్జి అయిన మిగతా క్షతగాత్రులు

మీర్జాగూడలో జరిగిన ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రుల్లో వికారాబాద్ ఆసుపత్రుల్లో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ప్రమాద ఘటనలో గాయపడ్డ వారిలో 12 మందిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో, మరో ఇద్దరినీ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరిన వారిలో టిప్పర్ యజమాని లక్ష్మణ్‌కు మెరుగైన చికిత్స కోసం సోమవారం హైదరాబాద్‌కు తరలించగా, అర్థోపెడిక్ సమస్యలు ఎదుర్కొంటున్న అబ్దుల్లా, సుమయా, ఆస్మాలు వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందడానికి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లారు. షఫీ, ఖాజావలి, సయ్యద్ అస్మా, తసూరా మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరిలో పావని ఆరోగ్యం మెరుగు పడడంతో తమ ఇంటికి వెళ్లారు. ప్రస్తుతం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో స్వప్న (వికారాబాద్), ప్రైవేట్ ఆసుపత్రిలో వాహీద్ (వెల్చాల్)లు చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉంటే, అంతకు ముందు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎస్పీ నారాయణరెడ్డి, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

ధ్వంసమైన బస్సు, టిప్పర్ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

చేవెళ్ల/మొయినాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మీర్జాగూడ రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన ఆర్టీసీ బస్, టిప్పర్ లారీని ప్రమాద స్థలం నుంచి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు సోమవారం అర్ధరాత్రి క్రేన్ సహాయంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే ప్రమాదంలో గాయాలపాలై చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 13 మంది క్షతగాత్రులను డీజీపీ శివధర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బస్ కండక్టర్ రాధతో మాట్లాడి ప్రమాద వివరాలపై ఆరా తీశారు. అలాగే ప్రమాద స్థలం వద్ద సహాయక చర్యలు చేపడుతుండగా గాయాలైన చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌ను చేవెళ్ల పోలీస్ క్వార్టర్స్‌కు వెళ్లి పరామర్శించారు. ఆయనతో పాటు అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్, ఏసీపీలు బాలాజీనాయక్, కిషన్‌గౌడ్, సీఐలు, స్థానిక పోలీసులు ఉన్నారు.



మెడికల్ షాపుల్లో ముమ్మర తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘించిన 12 దుకాణాలకు నోటీసులు
- ఆరు బృందాలుగా అధికారుల తనిఖీలు



మెడికల్ షాప్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌స్రవంతి రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో మంగళవారం జిల్లా డ్రగ్స్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. జోన్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.ప్రసాద్ ఆధ్వర్యంలో డ్రగ్స్ అధికారులు ఆరు బృందాలుగా ఏర్పడి మెడికల్ షాపుల్లో దాడులు నిర్వహించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అన్వేశ్, శ్వేత, బిందు, శైలజ, రష్మి, నాగరాజులతో కలిసి మహేశ్వరం జోన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్రవంతి రెడ్డి నాలుగు మండలాల్లో దాడులు నిర్వహించారు. మందుల నిల్వలు, లైసెన్స్‌లను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన 12 మెడికల్ షాపుల నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి నడుచుకోవాలని నిర్వాహకులకు డ్రగ్స్ అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, డ్రగ్స్ అధికారుల దాడుల సమాచారం ముందుగానే తెలుసుకున్న ఇర్విన్, మాడ్గుల మండల కేంద్రాల్లో పలువురు మెడికల్ షాపుల నిర్వాహకులు తాళాలు వేసి వెళ్లిపోయారు. నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్న పలువురిపై డ్రగ్స్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.



బుగ్గక్షేత్రం.. జాతరకు సిద్ధం

4

నేటి నుంచి ఉత్సవాలు

వేలాదిగా తరలిరానున్న భక్తులు

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

షాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో షాబాద్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారంతో 24వ రోజుకు చేరింది. దీక్షలో పాల్గొన్న వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రావాల్సిన న్యాయపరమైన రిజర్వేషన్ శాతాన్ని కొందరు కుట్రతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు రాజకీయాల్లో స్థానం కల్పించాల్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



శిథిల పాఠశాల భవనంపై ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): యాచారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులు శిథిలమవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఏ క్షణం ఏ గది కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదే విషయమై సోమవారం 'శిథిల భవనం.. భయం భయం'.. శీర్షికతో అధ్వానంగా యాచారం ఉన్నత పాఠశాల దుస్థితిపై వచ్చిన కథనానికి జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి స్పందించారు. భవనం దుస్థితిపై నివేదిక అందించాలని మండల పంచాయతీ రాజ్ ఏఈ వంశీని ఆదేశించారు. కాగా, భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, గదులు కూల్చివేయాల్సి ఉందని సీఈవోకు నివేదిక అందించారు.

పంటల కొనుగోలుపై నిషేధమా?

ప్రభుత్వ నిబంధనపై ఫార్మాసిటీ బాధిత రైతుల ఆందోళన



యాచారం మండలం మేడిపల్లిలో నిషేధిత భూమిలో సాగవుతున్న వరి పంట

నిషేధిత జాబితాలోని భూముల్లో పండిన పంటలను కొనని వైనం

యాచారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, గొల్లగూడ, మంగలిగడ్డ తండా, మర్లకుంట తండాల్లో నిషేధిత భూముల జాబితాలో సాగవుతున్న పంటలను కొనుగోలు చేయకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూముల్లోని పంటలను కొనొద్దని అధికారులకు ఆదేశాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో గతంలో ఫార్మాసిటీ కోసం భూసేకరణ చేపట్టిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ హయాంలో ఆయా గ్రామాల్లో 2,500 ఎకరాల భూములను

మిగతా 6వ పేజీలో...

పంట కొనకుండా నిబంధనలు దారుణం



మా పట్టా భూములను ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టడమే దారుణం. ఈ భూములను నమ్ముకొని ముత్తాతల కాలం నుంచి బతుకుతున్నం. మా భూముల్లో పండించిన పంటలను ప్రభుత్వం కొనకుండా నిబంధన విధించడం సరైంది కాదు.

- సందీప్‌రెడ్డి, రైతు, మేడిపల్లి

భారీ వర్షం.. అతలాకుతలం

పంట చేతికందే సమయంలో అపార నష్టం



మాడ్గుల: వర్షానికి పాడైన పత్తిని చూపుతున్న రైతు



ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డు రోడ్డులో వర్షం నీరు

చలికాలం ప్రారంభమైనా జిల్లా ప్రజలను వరుణుడు వెంటాడుతూనే ఉన్నాడు. మంగళవారం జిల్లాలోని మహేశ్వరం, ఆమనగల్లు, మాడ్గుల, యాచారం, ఇబ్రహీంపట్నం, చౌదరిగూడ, కేశంపేట మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో పంట చేతికందే సమయంలో పత్తి, వరి, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయలు, ఆకుకూరలు, తదితర పంటలు నీట మునిగాయి. తరుచూ కురుస్తున్న వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షంతో చెరువులు, కుంటల్లోకి వరద చేరుకుంది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఇక లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా పలుచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కేశంపేటలో పిడుగుపాటుకు లేగదూడ మృతి చెందింది.

- ఆందోళన చెందుతున్న రైతులు
- చెరువులు, కుంటల్లోకి చేరిన వరద
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు

మహేశ్వరం/ఆమనగల్లు/మాడ్గుల/యాచారం/ఇబ్రహీంపట్నం/చౌదరిగూడ/కేశంపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి మహేశ్వరం మండల కేంద్రంలోని కాలనీలన్నీ వరదనీటిలో మునిగిపోయాయి. మునుపెన్నడూ లేనివిధంగా గ్రామంలోని కాలనీల నీరంతా శ్రీ శివగంగ ఆలయంలోకి భారీ వరద చేరుకుంది. అలాగే రాజరాజేశ్వరాలయం గర్భగుడిలోకి వరద చేరడంతో

మిగతా 6వ పేజీలో...



మహేశ్వరం కస్తూర్బా పాఠశాలలోకి వర్షం నీరు రావడంతో గొలుసుకట్టుగా వెళ్తున్న విద్యార్థినులు

కేశంపేటలో..

మండల కేంద్రంలో దాదాపు రెండు గంటలపాటు వర్షం కురిసింది. రోడ్లపై భారీగా వరద నీరు చేరింది. లోతట్టు ప్రాంతాల కాలనీల ప్రజలు ఇబ్బందిపడ్డారు. మండలంలోని సంగెం, వేములనర్వ, అల్వాల, పాటిగడ్డ, కొత్తపేట, మంగళగూడ, బైర్‌ఖాన్‌పలి, కాకునూర్, లేమామిడి, నిర్దవెల్లి గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కాకునూర్ గ్రామంలో పిడుగుపాటుకు రూమాండ్ల కుమార స్వామికి చెందిన లేగదూడ మృత్యువాతపడింది. రూ.20 వేల విలువైన లేగదూడ చనిపోయిందని బాధిత రైతు వాపోయాడు.

బుగ్గక్షేత్రం.. జాతరకు సిద్ధం

- దక్షిణ కాశీగా ప్రసిద్ధి
- కోనేటిలో కొలువు దీరిన రామలింగేశ్వరుడు
- నేటి నుంచి ఉత్సవాలు



కోనేటిలో కొలువైన బుగ్గరామలింగేశ్వరుడు



అరుట్లలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రం

మంచాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా బాసిల్లుతున్న బుగ్గక్షేత్రం కార్తీక ఉత్సవాలకు ముస్తాబైంది. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల పరిధి బుగ్గరామలింగేశ్వర క్షేత్రంలో ఉత్సవాల నిర్వహణకు దేవాదాయ శాఖ ఏర్పాట్లు చేసింది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. యేటా కార్తీకంలో 15 రోజులు సాగే ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ నెల 5న(నేటి) కార్తీక పౌర్ణమి నుంచి అమావాస్య వరకు బుగ్గ జాతర కొనసాగుతుంది. ఇక్కడి నీటి ప్రవాహం తూర్పు నుంచి పడమర దిశకు పారుతూ కొండ ల్లోకి ప్రవహించడం ఇక్కడి ప్రత్యేకత. ఈ కోనేటిలో కార్తీక స్నానాలాచరిస్తే కష్టాలు తొలగి పుణ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. బుగ్గరామలింగేశ్వర క్షేత్రంలో ఉత్సవమూర్తులు గర్భగుడిలోకాక స్వయంభూగా నీటి ప్రవాహంలో వెలిసి దేవతా మూర్తులుగా పూజలందుకుంటున్నారు.

పరవళ్లు తొక్కుతున్న సెలయేరు...

నేటి నుంచి 20వ తేదీ అమావాస్య దాకా బుగ్గజాతర కొనసాగుతుంది. బుగ్గక్షేత్రంలో నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతోంది. కొండల నుంచి ప్రవహిస్తున్న ఈ నీటి ప్రవాహంలో కార్తీక స్నానాలు ఆచరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వస్తారు. ఆరుట్ల నుంచి బుగ్గజాతర వరకు 4 కిలోమీటర్ల రోడ్డును రీబీటీ చేశారు. సీఐ మధు ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. జాతర ఉన్నన్ని 15రోజులు ఇక్కడ హెల్త్ క్యాంప్ నిర్వహిస్తారు.

ఆరుట్ల జాతరకు ఇలా చేరుకోవాలి..

హైదరాబాద్‌కు 55కిలోమీటర్ల దూరంలో గల బుగ్గజాతరకు చేరుకునేందుకు పలు రూట్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే వారు ఇబ్రహీంపట్నం, మంచాల మీదుగా బుగ్గజాతరకు చేరొచ్చు. యాచారం-మాల్ ప్రాంతాల నుంచి వచ్చేవారు సాగర్ రహదారి గున్గల్-రంగాపూర్-జాపాల మీదుగా చేరుకోవచ్చు. అలాగే కందుకూరు, మహేశ్వరం రూట్ల నుంచి వచ్చేవారు సాగర్ హైవే ఆగాపల్లి మీదుగా జాపాల నుంచి బుగ్గజాతరకు చేరొచ్చు. చౌటుప్పల్ తదితర రూట్ల నుంచి వచ్చే వారు చౌటుప్పల్-రాచకొండ-ఆరుట్ల మీదుగా జాతరకు చేరుకోవచ్చు. ఆర్టీసీ ఇబ్రహీంపట్నం నుంచి జాతర జరిగే 15రోజుల పాటు ప్రతి అరగంటకో బస్సు సర్వీసు నడిపేలా ఏర్పాట్లు చేసింది.




పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే రంగారెడ్డి

మైసమ్మ తల్లో.. సల్లంగ చూడు

- నేటి నుంచి మైసిగండిలో మైసమ్మ బ్రహ్మోత్సవాలు
- ఆరు రోజుల పాటు జాతర.. భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు



ఉత్సవాలకు సిద్ధమైన మైసమ్మ ఆలయం



కొలువైన అమ్మవారు

కడ్తాల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పేదల ఇలవేల్పు... ఆపద మొక్కుల అమ్మ.. శక్తి స్వరూపిణిగా వెలుగొందుతున్న కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయం బ్రహ్మోత్సవాల(జాతర)కు ముస్తాబైంది. బుధవారం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. మైసమ్మ బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి నుంచి కార్తీక పంచమి వరకు నిర్వహిస్తారు. ఆలయ మహత్యం, స్థల ప్రాధాన్యం సంతరించుకున్న మైసమ్మ ఆలయంలో ఆరు రోజులు జాతర జరుగుతుంది. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. జాతరకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు తరలిరానున్నారు.

ఏర్పాట్ల పరిశీలన ..

మైసమ్మ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంగళవారం ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ పరిశీలించారు. నేటి నుంచి పదో తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశించారు. భక్తులకు దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈ సందర్భంగా సిరోలిపంతూ తెలిపారు.

కందుకూరులో ఘనంగా సదర్



సదర్ వేడుకలో అంజయ్యయాదవ్, స్థానికులు

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కందుకూరులో సోమవారం రాత్రి సదర్ సమ్మేళనాన్ని నిర్వహించారు. సీతారామ శాస్త్రి కాలనీ నుంచి కందుకూరు-యాచారం రోడ్డు వరకు దున్నపోతులతో ర్యాలీ నిర్వహించారు. యాదవ సంఘం మహిళలు బతుకమ్మ ఆటలతో సదర్‌ను ప్రారంభించారు. సంఘం మండల అధ్యక్షుడు పసుపుల పర్వతాలు, ఉపాధ్యక్షుడు కె.బాల్‌రాజ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్‌లో షాద్‌నగర్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్ యాదవ్ పాల్గొన్నారు. సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యతను చాటుతాయన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కడారి జంగయ్యయాదవ్, ఎ.అనిల్‌కుమార్, జె.లక్ష్మయ్య, పోతర్ల సుదర్శన్, నరేష్, డి.తిరుమలేశ్, డి.క్రిష్ణ, శ్రీశైలంయాదవ్‌లు పాల్గొన్నారు.

బాబోయ్ మొసళ్లు

- వెండికొండ సిద్ధేశ్వరాలయ సమీప కాలువలో సంచారం
- ఆందోళన చెందుతున్న స్థానికులు, భక్తులు



శంషాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ప్రసిద్ధ వెండికొండ సిద్ధేశ్వరస్వామి(సిద్దులగుట్ట) ఆలయం ఎదుట కాల్వలో మంగళవారం మొసలి కలకలం సృష్టించింది. స్థానికులు, భక్తులు దానిని చూసి భయాందోళనకు గురయ్యారు. కార్తీక మాసం కావడంతో ఉమ్మడి జిల్లాతోపాటు హైదరాబాద్ నుంచి వేలదిమంది భక్తులు కార్తీక దీపాలు వెలిగించడానికి తరలివస్తారు. భక్తుల రద్దీ ఎక్కువ ఉంటుంది. ఈ కాలువ హిమాయత్‌సాగర్ జలాశయాలకు నీరందించే పలు కాల్వలతో కలుస్తుంది. ఈ కాలువల్లో చేపల వేటకు వెళ్లొద్దని స్థానికులు వేటగాళ్లను కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మొసళ్లను పట్టుకొని తరలించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఇబ్రహీంపట్నం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపోల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ నెట్‌బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో విక్రమ్, హారికలు ప్రతిభ చూపి ఎంపికయ్యారు. అలాగే అండర్-14 విభాగంలో జస్విక్, అఖిల్, లక్ష్మీప్రసన్న, శ్రీలత ఎంపికైనట్లు పీఈటీ రాజు తెలిపారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.



నెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

అవినీతి సొమ్ముతో లబ్ధికి బీఆర్ఎస్ యత్నం

ఆమనగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అవినీతి సొమ్ముతో రాజకీయ లబ్ధికి బీఆర్ఎస్ ఉప ఎన్నికలో గెలిచే కుట్ర చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమిని తప్పదనే విపక్షాలు అవాకులు, చెవాకులు పేలుతున్నాయని అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, కల్వకుర్తి, మాడ్గుల, వెల్దండ మండలాల నాయకులతో కలిసి మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడలో నారాయణరెడ్డి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, కార్పొరేషన్ల చైర్మన్‌లు బెల్లయ్య నాయక్, శివసేనారెడ్డిలతో కలిసి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే నియోజకవర్గం ఆశించిన రీతిలో అభివృద్ధి చెందుతుందని కసిరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నాయకులకు ఓటర్లు నీరాజనం పలుకుతున్నారన్నారు. 22 నెలల కాంగ్రెస్ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందన్నారు. జూబ్లీహిల్స్‌లో విజయంతో సీఎం రేవంత్‌రెడ్డికి మరింత పట్టు లభిస్తుందని, ఇక్కడి పేదలంతా కాంగ్రెస్‌కు అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలాజీసింగ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, భాస్కర్‌రెడ్డి, మండ్లి రాములు, కేశవులు, సాయిరెడ్డి, సత్యం, బీక్యానాయక్, చేగూరి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చదువు ఇష్టం లేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

పూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తనకు చదువు ఇష్టం లేదని జీవితంపై విరక్తి చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. వికారాబాద్ జిల్లా చెన్గోముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండలం చిన్నబండ తండాకు చెందిన మూడావత్ రవి-జ్యోతిల కూతురు స్వాతి(16) మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కొన్ని రోజులుగా తనకు చదువు ఇష్టం లేదంటూ స్వాతి తన తల్లితో తెలిపింది. తల్లిదండ్రులు కూతురికి నచ్చజెప్పి పంపారు. ఈ నెల 1న తనకు ఆరోగ్యం బాగాలేదని స్వాతి ఇంటికొచ్చింది. తనకు చదవడం ఇష్టం లేక మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వాతి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలా ఆక్రమణల కూల్చివేత

» స్థానికుల ఫిర్యాదుతో చర్యలు తీసుకున్న హైడ్రా



నాలా కబ్జాలను తొలగిస్తున్న హైడ్రా

శామీర్‌పేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నాలాలు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే ఎంతటి వారైనా సహించేది లేదని హైడ్రా ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం తూంకుంట మున్సిపల్ పరిధి దేవరయంజాల్‌లో నాలాపై ఆక్రమణలను హైడ్రా ఆధ్వర్యంలో మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది కూల్చివేశారు. మహాలక్ష్మి వెంచర్ వద్ద గల గోదాముల యజమానులు నాలాపై నిర్మాణాలు చేశారు. వరద నీరు, డ్రైనేజీ నీరు వెళ్లలేక నిలిచిపోయింది. కాలనీలు, రోడ్లపై భారీగా నీరు నిలిచింది. దీంతో ప్రజలు నెలక్రితం హైడ్రాకమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయగా ఆయన స్పందించి దేవరయంజాల్‌లో పర్యటించి పరిశీలించారు. మంగళవారం హైడ్రా రంగంలోకి దిగి పోలీసుల బందోబస్తు మధ్య నాలాలపై నిర్మాణాలను జేసీబీతో కూల్చేసింది. అధికారులు నాలాలను తవ్వి పునరుద్ధరించారు. కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ టీపీవో స్రవంతి, డీఈఈ సునీత, ఏఈ శిరీష, ఇరిగేషన్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ వాసు పాల్గొన్నారు.

శామీర్‌పేటలో అథ్లెటిక్స్ క్రీడాపోటీలు

రేపటి నుంచి 13వ తేదీ వరకు క్రీడోత్సవాలు

16 గురుకుల పాఠశాలల నుంచి 1,200 క్రీడాకారులు



క్రీడాపోటీలకు ఏర్పాట్లు చేస్తున్న పీడీ వెంకట్‌రెడ్డి, పీఈటీలు

శామీర్‌పేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల గ్రౌండ్స్‌లో హైదరాబాద్ జిల్లా స్థాయి క్రీడోత్సవాలను నిర్వహిస్తామని ప్రిన్సిపల్ రవికుమార్ మంగళవారం తెలిపారు. క్రీడలను ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్స్ క్రీడాపోటీలకు గురుకులం స్పోర్ట్స్ గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్నారు. ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, పీఈటీలు సాయికుమార్, సాయిబాబ, సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను జిల్లా స్పోర్ట్స్ అధికారులు సందర్శించారు.

అథ్లెటిక్స్ క్రీడల్లో 1,200 మంది క్రీడాకారులు

జిల్లా స్థాయిలో అండర్ 14, 17, 19ఏజ్ గ్రూప్‌లకు చెందిన హైదరాబాద్ పరిధి 16 గురుకులాల 1,200 మంది క్రీడాకారులు క్రీడాపోటీల్లో పాల్గొననున్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, టెన్నీకాయిట్, చెస్ తదితర క్రీడాపోటీలను నిర్వహిస్తారు.

మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి

» ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిద్ది సుధాకర్


వికారాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహారం అందించడంతో పాటు బాధిత కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిద్ది సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదానికి కారణమైన వారిపైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఏవోకు ఆయన ఆప్, ఏఐపీఎస్‌వో రాష్ట్ర నాయకులతో కలిసి పలు డిమాండ్లు, సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు ప్రమాదం సాధారణమైనది కాదని, ఇది ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్య ఫలితమేనన్నారు. ఈ ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రవాణా శాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జీవో 111 పేరిట రహదారి పొడవునా భూములు కబ్జా చేసి వాటిని కాపాడుకోవాలని కొందరు చేస్తున్న కుట్రల కారణంగానే రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడం లేదన్నారు. ముఖ్యమంత్రి, స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ప్రధాన రహదారి ఇంత దరిద్రంగా ఉండడం గర్హనీయమన్నారు. ఆయనతో పాటు ఆప్ రాష్ట్ర మాజీ కన్వీనర్ బుర్రా రాము గౌడ్, హేమ సుదర్శన్ జిల్లోజు, జావీద్ షరీఫ్, రమ్య గౌడ్, లియాకత్ ఖాన్, పట్లోళ్ల అమరేందర్‌రెడ్డి, విజయలక్ష్మిపండిత్ ఉన్నారు.

వికారాబాద్‌కు నిధులు తెస్తా

» కడాతో వికారాబాద్‌కు ఉపయోగకరం

» ఏడాదిలోగా మెడికల్ కళాశాల పూర్తి చేస్తా

» అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



వికారాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులతో త్వరలోనే రివ్యూ సమావేశం నిర్వహిస్తానని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సోమవారం చేవెళ్ల సమీపంలో జరిగిన బస్సు ప్రమాదం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఈ ఘటన దురదృష్టకరమని అన్నారు. తాను సీఎంను అడిగినందుకే గ్రీన్ ట్రిబునల్ వారితో మాట్లాడి కేసు ఎత్తివేయడం జరిగిందని, త్వరలోనే మంత్రులతో మాట్లాడి త్వరితగతిన అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో కాడా ద్వారా పనులు జరుగుతున్నాయని, వాటితో వికారాబాద్ ప్రాంతానికి కూడా కొంత ఉపయోగం కలుగుతుందని చెప్పారు. కొడంగల్ నుంచి పలు రోడ్లు పరిగి, వికారాబాద్, తాండూరుకు వస్తాయన్నారు. వికారాబాద్‌లో మెడికల్ కళాశాలను ఒక సంవత్సరంలో పూర్తిచేస్తామని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ అభివృద్ధీ చేయలేదని, రాష్ట్రానికి రూ.8లక్షల కోట్ల అప్పు మాత్రం చేశారన్నారు. అసలు, వడ్డీలు చెల్లించడం వల్లే అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడుతోందని, చేయాల్సిన పనులకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు సుధాకర్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కిషన్‌నాయక్, రాజశేఖర్‌రెడ్డి, షరీఫ్, రాంచందర్‌రెడ్డి, ఎర్రవల్లి జాఫర్ పాల్గొన్నారు.

కదిలిస్తే కన్నీరే..

(మూడో పేజీ తరువాయి)



హాజీపూర్‌లో మృతుల ఇంటి వద్ద గ్రామస్తులు

వికారాబాద్, బషీరాబాద్ మండలాలకు చెందిన ఒక్కొక్కరు ప్రాణాలు కోల్పోవడం వారి అంత్యక్రియల్లో గ్రామస్తులు, నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అందరినీ కదిలించాయి. వారి రోదనలు చూసిన వారందరూ కన్నీటి పర్యంతమయ్యారు.

గుండెలవిసేలా రోదించిన స్నేహితురాళ్లు



రోదిస్తున్న ఎల్లయ్యగౌడ్

రోడ్డు ప్రమాదంలో నందిని, తనూష, సాయిప్రియ మృతి చెందిన సమాచారం తెలుసుకున్న వారి స్నేహితురాళ్లు గుండెలవిసేలా రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. యాలాల్ మండలం, హాజీపూర్‌కు చెందిన భార్యాభర్తలు లక్ష్మి, బందెప్ప మృతి చెందడంతో వారిద్దరు కూతుళ్లు అనాథలుగా మారారు. తాండూరుకు చెందిన ఓ కుటుంబంలో తండ్రి, కూతురుతో పాటు 40 రోజుల చిన్నారి ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలిచివేసింది. ఇంట్లో నుంచి సంతోషంగా బయలుదేరిన వారు రోడ్డు ప్రమాదంలో విగత జీవులుగా మారారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో వెళ్లిన వారు గంటల్లోనే శవాలుగా మారారు.

కన్నీటి సంద్రం

యాలాల్ మండలం, పేర్కంపల్లిలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు అక్కా చెల్లెళ్లు నందిని, తనూష, సాయిప్రియ అంత్యక్రియలు సోమవారం రాత్రి జరిగాయి. తమ గ్రామానికి చెందిన ముగ్గురు అక్కా చెల్లెళ్లు మృతి చెందిన సమాచారం తెలుసుకున్న ఆ గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకున్నాయి. వారి అంత్యక్రియలకు ఊరు ఊరంతా కదిలివచ్చింది. వారి చివరి చూపు కోసం తాండూరు, పరిసర ప్రాంతాల వారితో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా తరలివచ్చి నివాళులర్పించారు. యాలాల్ మండలం, హాజీపూర్‌లో లక్ష్మి, బందెప్పలు, తాండూరులో ఇందిరానగర్‌కు చెందిన షేక్ ఖాలీద్, సలేహాబేగం, ఆమె కూతురు జహీరా ఫాతిమా, బృందావన్ కాలనీకి చెందిన తబస్సుమ్, గౌతాపూర్‌కు చెందిన ముస్కాన్‌బేగం, వాల్మీకి నగర్‌కు చెందిన వెంకటమ్మ అలియాస్ స్వప్న మంగళవారం జరిగాయి. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని శ్రీరాంనగర్‌కు చెంతిన తారీబాయి అంత్యక్రియలు సోమవారం రాత్రి నిర్వహించారు. మృతుల కుటుంబాల్లో ఎవరినీ కదిలించినా.. జరిగిన ఘటనను తలచుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తాం : మాజీ ఎమ్మెల్యే పైలెట్

వికారాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/తాండూరు: మన్నెగూడ నుంచి అప్పా జంక్షన్ వరకు బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను వెంటనే చేపట్టకుంటే పార్టీలకతీతంగా సెక్రటరియేట్‌ను ముట్టడిస్తామని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి హెచ్చరించారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వం రోడ్డు విస్తరణ చేపట్టకుంటే ప్రజాగ్రహాన్ని చవిచూస్తారని హెచ్చరించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రోహిత్‌రెడ్డి మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి రూ.10వేల చొప్పున ఆర్థికసహాయం అందజేశారు. లక్ష్మీనారాయణపూర్‌లో అఖిలారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన చిన్నారులకు తోడ్పాటునందిస్తానన్నారు. ఆయనతో నాయకులు నయీం(అప్పు), రవీందర్‌రెడ్డి, ముఖ్తార్ నాజ్, పట్లోళ్ల నర్సిములు ఉన్నారు.

మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో... చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

» ఇద్దరు డిశ్చార్జి, మరో యువతిని నిమ్స్‌కు తరలింపు

» చికిత్స పొందుతున్న 13 మంది రోడ్డు ప్రమాద బాధితులు



మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

చేవెళ్ల/మొయినాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ -బీజాపూర్ జాతీయ రహదారిపై జరిగిన ఆర్టీసీ బస్-కంకర టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన 15 మంది క్షతగాత్రులు చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. చికత్స పొందుతున్న తాండూరుకు చెందిన మాజీద్ భార్య ఇదే ప్రమాదంలో మృతిచెందడంతో ఆమె అంత్యక్రియల కోసం అతడిని మంగళవారం కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. అతడి ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు తెలిపారు. తాండూరుకు చెందిన సాయిశ్రీ ఆరోగ్యం మెరుగుపడటంతో డిశ్చార్జి చేశారు. నందిని అనే యువతిని హైదరాబాద్‌లక్షణజ నిమ్స్‌కు ఆమె కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. చేవెళ్ల మండలం అంతారానికి చెందిన నర్సింలు, సూజతతో పాటు 13 మంది చికిత్స పొందుతున్నారు.

కాలు విరిగింది



మాది పూడూరు మండలం. నేను ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తా. రోజు మాదిరిగానే హైదరాబాద్‌లో డ్రైవింగ్ చేసేందుకు వెళ్తుండగా ప్రమాదం బారినపడ్డా. నా తలకు గాయమైంది. కాలు విరిగింది. మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు.

- అఖిల్‌ఖాన్, పూడూరు

డ్యూటీకి పోతుండగా..



ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వద్ద గన్‌మన్‌గా పనిచేస్తున్నా. ఇందులో భాగానే డ్యూటీకి వెళ్లేందుకు రోజు మాదిరిగానే ఆర్టీసీ బస్సులో వస్తుండగా ప్రమాదం జరిగింది. కాలుకు, చేతికి బలమైన దెబ్బలు తగిలాయి. ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నా. ప్రమాదం లేదని వైద్యులు చెప్పారు.

- దయాకర్, కానిస్టేబుల్



బాగా నొప్పి వేస్తుంది ...

నా తలకు తీవ్ర గాయాలయ్యాయి. శరీరమంతా దెబ్బలు తగిలి బాగా నొప్పులయ్యాయి. ప్రమాద సంఘటన నుంచి నేను ఇంకా తేరుకోలేకున్నాను. చనిపోయిన ప్రయాణికులకు తలుచుకుంటే దుఃఖం వస్తోంది. నాకు వైద్యులు వైద్యం బాగానే చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం లేదని చెప్పారు.

- రాధ, బస్సు కాండక్టర్

బీజాపూర్ హైవే పనులను వెంటనే పూర్తి చేయాలి



తాండూరులో డెవలప్‌మెంట్ ఫోరమ్ నిరసన

షాబాద్/తాండూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బీజాపూర్ జాతీయ రహదారి పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో బీజాపూర్ జాతీయ రహదారిపై సీపీఎం, ఎఐఎఫ్‌బి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. భాస్కర్ మాట్లాడుతూ.. సోమవారం జరిగిన ప్రమాదం అందరినీ కలచివేసిందని, బీజాపూర్ రహదారిపై పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని డిమాండ్ చేశారు. అలాగే హైవే పనులను ప్రారంభించి త్వరగా పూర్తిచేయాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గాయపడిన వారికి రూ.10లక్షల సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జగదీష్, నాయకులు దేవేందర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు బాగుచేయాలని నిరసన

అధ్వానంగా మారిన రోడ్లను బాగుచేయాలని మంగళవారం తాండూరు డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని విలియమూన్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. పార్టీలకు అతీతంగా నిర్వహించిన ఈ ధర్నాలో వివిధ పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు. మీర్జాగూడ బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేరుకొని మద్దతు తెలిపారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డును బాగుచేయాలని, మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 2023 ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసినా కోర్టులో ఉన్న కేసులపై స్పందించకుండా ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రోహిత్‌రెడ్డి ఆరోపించారు. అనంతరం రోడ్లు బాగు చేయాలని కోరుతూ తహసీల్దార్ తారాసింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తాండూరు డెవలప్మెంట్ ఫోరం ప్రతినిధి కమల్తార్, టీజేఏఎస్ ఇన్‌చార్జి సోమశేఖర్, వివిధ పార్టీల నాయకులు గోపాలకృష్ణ, శోభారాణి, ఆసిఫ్, అనురాధ, సంగీత, రాజ్‌కుమార్, రాజుగౌడ్, విజయలక్ష్మిపండిత్, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

రూ.50లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి

షాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కో వ్యక్తిపై రూ.50లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాకేష్ అన్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని మంగళవారం చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున, గాయపడ్డవారికి రూ.10లక్షలు వెంటనే చెల్లించాలన్నారు.

బస్సు ప్రమాద ఘటన విషాదకరం

షాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటన విషాదకరమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ప్రవీణ్ కుమార్ మాదిగ అన్నారు. మంగళవారం చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ.కోటి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు.

అదృష్టం బాగుండి బయటపడింది

పెద్దేముల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తన అన్న కూతురు అదృష్టం బాగుండి ప్రమాదం నుంచి బయటపడిందని స్వప్న బాబాయ్ మల్లేశం అన్నారు. ఖానాపూర్‌నకు చెందిన స్వప్న హైదరాబాద్‌లో బీఎస్సీ నర్సింగ్ చేస్తోందని, సర్టిఫికెట్లు తీసుకునేందుకు ఆదివారం వచ్చి సోమవారం ఉదయం బస్సుకు బయలుదేరిందని చెప్పారు. వెళ్లిన గంటకే బస్సు ప్రమాదానికి గురైందని ఫోన్ రావడంతో ఆందోళనకు గురయ్యామని చెప్పారు. వెంటనే అక్కడికి చేరుకున్నాక అక్కడి పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోయిందని, మా కూతురుతో మాట్లాడాక కాస్త కుదుటపడినా.. చనిపోయిన వారిని చూసి బాధపడ్డామన్నారు. తమ కూతురు వికారాబాద్‌లో చికిత్స పొందుతోందన్నారు.

విద్యుదాఘాతంతో హోంగార్డు మృతి

» ఆసుపత్రికి వెళ్లి పరిశీలించి సంతాపం తెలిపిన ఎస్పీ



శ్రీనివాస్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



శ్రీనివాస్(ఫైల్)

వికారాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ఓ హోంగార్డు మృతిచెందిన సంఘటన వికారాబాద్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చేవెళ్ల మండలం కౌకుంట్లకు చెందిన హోంగార్డు శ్రీనివాస్(37) వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో 15ఏళ్లుగా హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం పోలీస్ వాహనాన్ని కడుగుతున్న క్రమంలో స్టార్టర్ ఆన్ చేయబోయి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే పోలీస్ సిబ్బంది అతడిని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాస్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆసుపత్రికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. శ్రీనివాస్ మృతదేహానికి సంతాపం తెలియజేశారు.

శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటాం: ఎస్పీ

హోంగార్డు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలో ఎంటీ సెక్షన్(మోటారు ట్రాన్స్‌పోర్ట్)లో విధులు నిర్వహిస్తూ కరెంటుషాక్‌తో మృతిచెందిన సీహెచ్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసు శాఖ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శ్రీనివాస్ మృతి తమను కలిచి వేసిందని, ఇది పోలీస్ శాఖకు తీరని లోటు అని పేర్కొన్నారు. శ్రీనివాస్ మరణానికి సంబంధించి ఉన్న అనుమానాలు దృష్టిలో ఉంచుకుని, అతడు పని చేస్తున్న ప్రాంతంలో కరెంట్ షాక్‌కు గురయ్యాడా? లేదా మరేదైనా కారణమా? అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో పోస్టుమార్టం నివేదిక కీలకం అవుతుందని, ఆ నివేదికొచ్చే వరకు ఎలాంటి ముందస్తు నిర్ధారణకు రాదని ఎస్పీ తెలిపారు. అతడి కుటుంబానికి శాఖాపరంగా అన్ని విధాలా సహకరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

పాల్గొన్న లగచర్ల, పోలెపల్లి, హకీంపేట్ గ్రామాల రైతులు



పాలాభిషేకం చేస్తున్న రాజేశ్‌రెడ్డి, నాయకులు

దుద్యాల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూములిచ్చిన హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల గ్రామాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారు. ఆ గ్రామాల్లో రూ.7,600 కోట్లతో ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయనున్నారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజలు పోలెపల్లి రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. పోలపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, నాయకుడు నరసింహారెడ్డిలు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నారన్నారు. కొడంగల్‌లో అభివృద్ధిని ఓర్వలేక ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, కేటీఆర్‌లు అసత్య ప్రచారానికి ఒడిగట్టారన్నారు. రైతులు మాట్లాడుతూ.. తమకు భూమి కోల్పోయిన బాధ ఉన్నా.. ఒకే దఫాలో పరిహారం ఇవ్వడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి, జయరాములు, శ్రీనివాస్, చెన్నప్ప పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డిని కలిసిన మహేశ్



తలకొండపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు గుజ్జల మహేశ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బీసీల రిజర్వేషన్ల అమలు గూర్చి చర్చించినట్లు మహేశ్ పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ఆమనగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప కోరారు. ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 15న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఆమనగల్లు కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ విజయవంతంపై ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ



మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వరూప

సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో రాజీకి అవకాశం ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెగా లోక్‌అదాలత్ గురించి ఇరు వర్గాలకు సమాచారం అందించి రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకునేలా చూడాలని జడ్జి సూచించారు. కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సూచించారు. సమావేశంలో ఆమనగల్లు సీఐ జానకిరామ్‌రెడ్డి, కడ్తాల సీఐ గంగాధర్, ఎస్సైలు వెంకటేశ్, శ్రీకాంత్, రాఘవేందర్, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఫీల్ట్ అసిస్టెంట్‌కు తీవ్ర గాయాలు

యాచారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కాలువిరిగి తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం రమేష్ నాగార్జున సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్లకు సాసర్లను కూలీలతో చేయిస్తున్నారు. వర్షం కురుస్తుండడంతో వారిని ఇళ్లకు పంపి ఆయన తన లూనా వాహనంపై గున్‌గల్‌లోని ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కాలువిరిగి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఎంపీడీవో రాధారాణి గ్రామస్తుల సహకారంతో హుటాహుటిన ఉస్మానియాకు తరలించారు. సమాచారమందుకున్న యాచారం సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్‌ను ఆదుకుంటామని డీఆర్‌డీవో శ్రీలత 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ నందీశ్వర్‌రెడ్డి

యాచారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి వివరాలు అడిగితే చెప్పకూడదని సీఐ నందీశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని నందివనపర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్‌నేరాలు, డిజిటల్ అరెస్టు, ఫేక్ ఐడీ కార్డులు, స్టాక్‌మార్కెట్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉన్నత చదువులు చదివి సమాజసేవలో పాలు పంచుకోవాలని హితవు పలికారు. ఎస్సైలు సత్యనారాయణ, ప్రియాంకతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు విసిగిపోయారని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆకులమైలారం గ్రామ మాజీ అధ్యక్షుడు గడికోట యాదయ్య ఆధ్వర్యంలో పలువురు నగరంలోని సబితాఇంద్రారెడ్డి నివాసానికి వెళ్లి బీఆర్‌ఎస్‌లో చేరారు. జి.ఈశ్వర్, రవీందర్, వి.మహేష్, డి.మహిపాల్‌లతో పాటు 10 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎస్.సురేందర్‌రెడ్డి.డి. చంద్రశేఖర్, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, అంజయ్య, బీరప్ప, బి.కాలిదాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

ప్రజల ప్రాణాలను పరిరక్షించండి

- మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



షాద్‌నగర్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను అదుపుచేసి, ప్రజల ప్రాణాలను పరిరక్షించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌కు ఆయన లేఖ రాశారు. చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద బస్సు టిప్పర్ ఢీకొన్న దుర్ఘటనలో 19మంది ప్రాణాలను కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. వాహనాల ఫిట్‌నెస్‌ను, ఓవర్‌లోడ్‌ను కట్టడి చేయకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయని తెలిపారు. రవాణాశాఖ అధికారులు వాహనాల ఓవర్‌లోను అదుపు చేయడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. అలాగే ఇంజనీరింగ్ అధికారులు రోడ్ల పరిస్థితులను, వాహనాల రద్దీని ఎప్పటికప్పుడు గమనించి, రోడ్లకు మరమ్మతులను చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన తరువాత ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచడం లేదని బక్కని తెలిపారు. ప్రమాదానికి గురైన బస్సులో నిబంధన మేరకు 55 మంది ఉండాలని, 72 మంది ఉండడంతో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. రవాణా, పోలీసు, ఇంజనీరింగ్ శాఖలు నిర్లక్ష్యం వీడాలని, ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించి, ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని ఈ సందర్భంగా బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

షాద్‌నగర్‌రూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు వస్తాయని రాజేంద్రనగర్ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడలో రైతు వెంకట్‌రెడ్డి సాగు చేసిన కేఎన్‌ఎం 1638 రకం వరి పైరును మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామానికి ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి నాణ్యమైన కేఎన్‌ఎం 1638 వరి విత్తనాలను ఇవ్వడం జరిగిందన్నారు. అట్టి విత్తనాలను వాడటం వల్ల అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. అంతేగాకుండా తోటి రైతులకు విత్తనాలు ఇవ్వవచ్చని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వంగడం కిందికి ఒరిగిపోలేదన్నారు. ఏవో నిషాంత్‌కుమార్, ఏఈవోలు గోవర్ధన్, తేజ ఉన్నారు.



కొండన్నగూడలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త పద్మజ

పత్తి రైతులను ఆదుకోవాలి

ఆమనగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల పంట దెబ్బతిని నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు కోరారు. పట్టణంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్షాల కారణంగా పత్తి పంట చాలా వరకు దెబ్బతిందన్నారు. వచ్చిన కొద్దిపాటి దిగుబడి కూడా వర్షాలకు తడిసి నల్లబారిందని ఆయన అన్నారు. అలాగే విక్రయించడానికి వెళితే.. తేమ శాతం పేరుతో గ్రామీణ ప్రాంతాలలో వ్యాపారులు మోసగిస్తున్నారని మండిపడ్డారు. 20 శాతానికి పైగా తేమ ఉన్న పంటను కూడా పూర్తి మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

శంకర్‌పల్లి/ఆమనగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. తడి, పొడిచెత్తను వేరుచేసి గ్రామపంచాయతీ బండ్లలోనే వేయాలన్నారు. ఎంపీవో గిరిరాజ్, ఏపీవో నాగభూషణం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల నిర్దేశిత లక్ష్యాల పూర్తికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని ఆమనగల్లు ఎంపీడీవో కుసుమ మాధురి అన్నారు. ఆమనగల్లు మండలం సింగంపల్లిలో ఉపాధిహామీ పథకం పనుల గుర్తింపు, కార్బన్ క్రెడిట్స్, లింక్‌రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై స్పెషలాఫీసర్ అభిషేక్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో అమలవుతున్న పథకాల పురోగతిపై అధికారులతో చర్చించారు. అభివృద్ధి పనులను, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పాడైన రోడ్డును తాత్కాలికంగా మరమ్మతు చేసి రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఎంపీడీవోకు గ్రామస్థులు వినతిపత్రం ఇచ్చారు. ఏపీవో మాధవరెడ్డి, ఇన్‌చార్జి కార్యదర్శి లక్ష్మణ్, టీఏ జయమ్మ, ఎఫ్ఏ వినోద్ రెడ్డి, వెంకటేశ్ ఉన్నారు.

సీఐటీయూ మున్సిపాలిటీ కన్వీనర్‌గా ఎల్లేశ్



సీఐటీయూ నూతన కమిటీ

ఇబ్రహీంపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఇబ్రహీంపట్నం మున్సిపల్ కన్వీనర్‌గా చింత పట్ల ఎల్లేశ్‌ను మరోసారి ఎన్నుకున్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన సీఐటీయూ సర్వసభ్య సమావేశంలో ఎల్లేశ్‌తోపాటు 21మందిని కన్వీనింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, సహాయ కార్యదర్శి స్వప్న తదితరులున్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలి

ఆదిభట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని శ్రీమిత్ర వెంచర్‌లోని పార్కు స్థలాన్ని కాపాడాలని కమిషనర్ బాలకృష్ణకు స్థానిక ప్రజలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మరియపురం శ్రీమిత్ర వెంచర్‌లోని పార్కు స్థలాన్ని ఆక్రమించి ఓ వ్యక్తి కాంపౌండ్ వాల్ నిర్మించారని, మున్సిపల్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని రక్షించి ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పల్లె రజినీకాంత్‌గౌడ్, అశోక్, నరసింహ, రాజు తదితరులు ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం

ఆదిభట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఇబ్రహీంపట్నం విద్యాధికారి హీర్యానాయక్ అన్నారు. ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్ ప్రాథమిక పాఠశాలలో వండర్‌లా సంస్థ సొంత నిధులతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన వాష్‌రూమ్‌లను మంగళవారం ప్రారంభించారు. కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ శ్రీనివాస్, వండర్‌లా మేనేజర్ రాంబాబు, పార్కింగ్ హెడ్ మధుసూదన్‌గుప్తా, మురళి, హెచ్ఎం కృష్ణ, టీచర్లున్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రంగారెడ్డి జిల్లా జేఏసీ నాయకులు జి.అమరేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం జేఏసీ నేతలతో కలిసి తహసీల్దార్ కె.గోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్ చేసిన ప్రకారం 42శాతం రిజర్వేషన్ కల్పించాలని, అప్పటివరకు స్థానిక ఎన్నికలు నిర్వహించకూడదన్నారు. గూడూరు భాస్కర్, మహిపాల్, రాజు, శివకృష్ణ, తదితరులున్నారు.

పంటల కొనుగోలుపై నిషేధమా?

(మూడో పేజీ తరువాయి)

నిషేధిత జాబితాలో పెట్టారు. ఈ భూముల్లో వరి, పత్తి, జొన్న, కంది, కూరగాయల పంటలను రైతులు సాగు చేసుకుంటున్నారు. పత్తిని విక్రయించాలంటే కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ కావడం లేదని మంగలిగడ్డ తండాకు చెందిన రైతు ధర్మరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మరో ఎకరంన్నరలో వరి సాగు చేస్తున్నానని, ఆ పంటను సైతం ప్రభుత్వం కొనుగోలు చేయదని అధికారులు చెప్పడంతో ఏం చేయాలో తోచడం లేదని తెలిపారు. భూసేకరణలో తమ పట్టా భూములను తీసుకోవద్దని రైతులు ఒక వైపు ఆందోళన చేస్తుండగా పండిన పంటను కొనుగోలు చేయకపోవడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులను ఇబ్బంది పెడితే వారే ప్రభుత్వానికి భూములు అప్పగిస్తారని భావించి పంటలను కొనుగోలు చేయకపోవడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని రైతు శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్‌ను వివరణ కోరగా నిషేధిత భూముల జాబితాలో సాగవుతున్న ధాన్యాన్ని కొనడం లేదని ధ్రువీకరించారు.

మహాసభలను విజయవంతం చేయాలి

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల శాఖ కన్వీనర్ బుడ్డీరపు శ్రీనివాస్ కోరారు. మంగళవారం కందుకూరు, రాచులూరు, లేమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆశావర్కర్లతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలకు అనుకూలంగా నెలకు రూ.18వేల వేతనాన్ని మంజూరు చేయాలన్నారు.



కందుకూరు : పోస్టర్ విడుదల చేస్తున్న శ్రీనివాస్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ఈనెల 10, 11వ తేదీల్లో రాజేంద్రనగర్‌లోని కాటేదాన్‌లో నిర్వహించనున్న సీఐటీయూ నాలుగో జిల్లా మహసభలకు కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన అన్నారు.

సీఐటీయూ మహాసభల పోస్టర్ విడుదల

శంషాబాద్ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10, 11వ తేదీల్లో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభల పోస్టర్‌ను మంగళవారం శంషాబాద్ మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో విడుదల చేశారు. మండల నాయకుడు సామెల శంషాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ప్రవీణ్, నాగేశ్, జయేందర్‌తో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కేంద్రం కాలరాస్తోందని ఆరోపించారు. మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీర్మానాలుచేసి మరో ఉద్యమానికి సన్నద్ధం కానున్నట్లు తెలిపారు. కార్మికులు ఇందిర, రవి తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ రూరల్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే బస్సు ప్రమాదాలు



సమావేశంలో మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తరచూ బస్సు ప్రమాదాలు జరిగి, ప్రయాణికులు ప్రాణాలను కోల్పోతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. షాద్‌నగర్‌లోని తన ఆఫీసులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాహనాల అధిక లోడ్‌ను నియంత్రించకపోవడం, రోడ్ల మరమ్మతులపై నిర్లక్ష్యం చేయడంతోనే వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. వాహనాల ఫిట్‌నెస్‌ను, ఓవర్ లోడ్‌ను కట్టడి చేస్తే చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ వద్ద బస్సు, టిప్పర్ ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. ఓవర్‌లోడ్ అధిక స్పీడ్‌తో టిప్పర్ రావడం, రోడ్డుపై గోతులు ఉండడం, ఆర్టీసీ బస్సులో సైతం అధికంగా ప్రయాణికులు ఉండడం ప్రమాదానికి కారణమైందని తెలిపారు. రాష్ట్ర వ్యాపంగా తరచు ప్రమాదాలు జరుగుతున్న పోలీసు, ట్రాఫిక్, రవాణాశాఖ అధికారులు ఏం చేస్తున్నట్టని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు మోహన్‌సింగ్, నర్సింహయాదవ్, సుధాకరప్ప, చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, అత్తాపూర్ మహేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

కొందుర్గు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలికల ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో అవసరమని ప్రధానోపాధ్యాయుడు గోపినాథ్ అన్నారు. మంగళవారం కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష పీఎంశ్రీ కరాటే శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ రమేష్, బాలికలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు తలెత్తనీయొద్దు

కేశంపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు లేకుండా చూసుకోవాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

భారీ వర్షం.. అతలాకుతలం

(మూడో పేజీ తరువాయి)

ఆలయంలోని అమ్మవారు, స్వామి వారు వర్షం నీటిలో మునిగిపోయాయి. ఆలయ కమిటీ సభ్యులతోపాటు గ్రామ పెద్దలు ఆలయంలోకి వరద నీటిని తొలగించారు. మండలంలోని మోడల్ స్కూల్ వద్ద ప్రధాన రహదారిలో మోకాళ్ల లోతు నీరు చేరడంతో విద్యార్థులు ఇళ్లకు చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి వరద చేరుకుంది. ఆయా గ్రామాల్లోని ఆకు కూరల పంటలు నీట మునిగాయి. రామచంద్రగూడ గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువు వర్షానికి పూర్తిగా నిండి అలుగు పారింది. మహేశ్వరంలోని కస్తూర్బా పాఠశాల ప్రాంగణం వరదనీటితో మునిగిపోయింది. దీంతో విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.



యాచారం: మండలం మేడిపల్లిలో వర్షానికి తడచిన పత్తిపంట



కేశంపేట: పిడుగుపాటుకు మృతిచెందిన లేగదూడ

ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో..

ఆమనగల్లుతో పాటు మాడ్గుల మండలాల పరిధిలో అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. ఆమనగల్లు ఏపీజీవీబీ బ్యాంక్ ఎదుట, తహసీల్దార్ కార్యాలయ సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి పలుచోట్ల పత్తి పంటకు నష్టం వాటిల్లింది. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లపై, ఇళ్ల మధ్య నీరు నిలిచింది. పలు గ్రామాల రోడ్లు బురదమయంగా మారాయి. మాడ్గుల మండల పరిధిలోని నల్ల చెర్వు గ్రామంలో ఇళ్లలోకి నీరు చేరింది.

యాచారంలో..

మండలంలోని తక్కళ్లపల్లి, కొత్తపల్లి, మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, చిన్నతూండ్ల, ధర్మన్నగూడ, మంగలిగడ్డతండా తదితర గ్రామాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. చేనులోనే పత్తి పంట తడిచిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి తడిసి ముద్దయిన పత్తి మళ్లీ తడిసిందని రైతులు వాపోతున్నారు. తనకున్న నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్న పత్తి నల్లబారిపోయిందని ధర్మన్నగూడకు చెందిన రైతు యాదయ్య ఆందోళన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నాడు.

ఇబ్రహీపట్నం, జిల్లేడ్ చౌదరిగూడలో..

ఇబ్రహీంపట్నం పరిధిలో తడిసిన పొలాల్లో వరి కోతలకు ఇబ్బందులెదురవుతున్నాయి. వరి కోత యంత్రాలను ఆఫ్ చేశారు. పలు చోట్ల వచ్చిన వరదలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని తుమ్మలపల్లి, లచ్చంపేట, వనంపల్లి, చౌదరిగూడ తదితర గ్రామాల్లో వర్షానికి వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. చెతికి వచ్చిన పంటలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉప ఎన్నికలో నవీన్‌యాదవ్‌దే గెలుపు



ఓట్లు అడుగుతున్న జంగారెడ్డి

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో హస్తం పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపునకు శ్రీరామ రక్షగా నిలుస్తాయని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆ పార్టీ నేతలతో కలిసి సోమాజిగూడ డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి నవీన్‌యాదవ్ తరపున ఓట్లు అడిగారు. కాగా, డివిజన్‌లో నవీన్‌మాదవ్‌కు స్వచ్ఛందంగా ఓట్లు వేయనున్నట్లు హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతున్నట్లు స్థానికులకు వివరించినట్లు తెలిపారు. మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, సహకార సంఘం చైర్మన్ ఎస్.వెంకట్‌రాంరెడ్డి, నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, ఎస్.వెంకటేష్‌గౌడ్, కె.విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్.జగన్ కురుమ, ప్రశాంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మార్గనిర్దేశకులు

శంషాబాద్ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు మార్గనిర్దేశకులని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని నర్కూడ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి పదవీ విరమణ సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. రాంరెడ్డి దంపతులను శాలువాలతో సన్మానించారు. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



రాంరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాల నిపుణులు కె.వెంకటేశ్ విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం కొత్తూరులోని పీఎంసీ జడ్పీహెస్ఎస్ పాఠశాలను వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం సదర్శించింది. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంజనీరింగ్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం దేశంలో డ్రోన్‌ల వాడకం పెరిగిందని, వాటిని తయారు చేయడం, వినియోగించడం ఎలా అనే అంశాలపై విద్యార్థులకు పలు సూచనలు అందజేయడంతో పాటు, పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్‌తోపాటు భగవంతు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కొత్తూరు : టిశాట్, టీఎస్ జీహెచ్ఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తూరులో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ కాంపిటీషన్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి టీచర్లు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తూరు, ఇన్ముల్‌నర్వ, హెచ్ఎంలు అంగుర్‌నాయక్, రవికుమార్, వెంకట్‌రాంరెడ్డి, అరవింద్ శిరీష, భగవంతు శ్రీనివాస్, నవనీత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

షాద్‌నగర్ : విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌ల బకాయిల కోసం నేడు(బుధవారం) ఎమ్మెల్యే, ఎంపీల ఆఫీసులను ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్‌నాయక్ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.8,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను ఇవ్వకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు.

షాద్‌నగర్ రూరల్ : విద్యతోనే మనిషికి బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గందె సురేష్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

శంకర్‌పల్లి : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని శంకర్‌పల్లి నారాయణ హైస్కూల్ ప్రిన్సిపాల్ దివ్య తెలిపారు. నారాయణ హైస్కూల్స్ వికారాబాద్ జోనల్‌స్థాయి క్రీడలను జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం వల్లికుమార్‌లతో కలిసి శంకర్‌పల్లి నారాయణ హైస్కూల్‌లో ప్రారంభించారు. ఎస్సైలు దేవేందర్, శ్రీశైలం, తాండూరు స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణ, సంగారెడ్డి ప్రిన్సిపాల్ లక్ష్మణ్, వికారాబాద్ ప్రిన్సిపాల్ థెరిస్సా కో-ఆర్డినేటర్‌లు కనకరాజు, అనూష, వనిత తదితరులు ఉన్నారు.

మొయినాబాద్ రూరల్ : హిమాయత్ నగర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్వర్యంలో మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి మల్లయ్య తదితరులు హాజరయ్యారు.

తలకొండపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే ఉన్నతి శిక్షా ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర సుధాకర్‌రెడ్డి అన్నారు. వెల్జాల జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించారు. విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు.

ఎల్వోసీ అందజేత



చౌదరిగూడ,నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలో లచ్చంపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బీమయ్యకు మంజూరైన రూ. 2లక్షల ఎల్వోసీని మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాములు, రవీందర్‌రెడ్డి, రామకృష్ణ, బాబురావు, రాంచంద్రయ్య, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, యాదయ్య, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

యాచారం ఆసుపత్రికి అంబులెన్స్ అందజేత

యాచారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి సోమవారం సాయంత్రం గున్‌గల్‌లోని తిరుమల డెయిరీ ఫామ్ నిర్వాహకులు అంబులెన్స్‌ను అందజేశారు. తిరుమల డెయిరీ ఫామ్ డైరెక్టర్ డాక్టర్ నరేశ్ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద అన్నిసదుపాయాలతో కూడిన అంబులెన్స్‌ను అందజేస్తున్నట్లు ప్రకటించారు. సీఎస్‌ఆర్ ద్వారా ఆరోగ్యం, భద్రత, విద్య పర్యావరణ స్థిరత్వం వంటి రంగాల్లో శాశ్వతమైన సామాజిక ప్రభావాన్ని సృష్టించడానికి తాము చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. దేశంలోని పది ప్రభుత్వ ఆసుపత్రులకు పది అంబులెన్స్‌లను అందించామన్నారు.



ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్ అప్పగిస్తున్న డాక్టర్ నరేశ్